విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశాంత్‌కాలనీ, బల్కంపేట, బీకేగూడ మసీదు, ఈఎస్‌ఐ స్టాఫ్ క్వార్టర్స్, శాంతిబాగ్, శివబాగ్, కేకే జోన్ హోటల్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రీన్‌పార్క్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, డీకేరోడ్డు, మాజీ సీఎం రోశయ్య నివాస లేన్, శివబాగ్‌కాలనీ, శ్రీనివాస టవర్స్, అమోఘ ప్లాజా, మేటాస్, బ్లూ మూన్ హోటల్, మనీ ల్యాండ్ చైనా, మా టీవీ బిల్డింగ్, మా టీవీ లేన్, హిందూ ప్రెస్, పుల్లారెడ్డి, స్నేహలత బిల్డింగ్ ప్రాంతాలు.

సీతాఫల్‌మండి సబ్‌స్టేషన్ పరిధిలో...

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఎస్‌పీ మండీ వెల్ఫేర్ అసియేషన్, ఎల్‌ఎన్ టవర్స్, త్రినేత్ర కాంపిల్ అండ్ ట్రాన్స్ ఫార్మర్, గణేష్ టెంపుల్, క్లాసిక్ అపార్ట్‌మెంట్. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మేడిబావి ఏరియా, ఇంద్రానగర్ 1, 2, 3, మీనా కేఫ్ ఏరియా, ఎంపీ రాజయ్య ప్రాంతం. మ. 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామాలగుండు రామాలయం, హనుమాన్ టెంపుల్, నెహ్రూ హైస్కూల్. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్కండేయనగర్, ఫ్రైడే మార్కెట్, ఎస్‌ఆర్ హాస్పటల్, రాఘవ గార్డెన్, ఉప్పరబస్తీ, బాపన్‌బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

15 నుంచి గిరిజన చైతన్య యాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 15 నుంచి గిరిజన చైతన్య యాత్రను ప్రాంభించనున్నట్లు టీపీసీసీ ఎస్టీ సెల్ వైస్ చైర్మన్, రాష్ట్ర నిరుద్యోగ విద్యార్థి జేఏసీ చైర్మన్ వి.భీంరావు నాయక్ గురువారం పేర్కొన్నారు. రాష్ట్రంలో గిరిజన లంబాడి సోదరులు, ఆదివాసి గోండుల మధ్య చిచ్చు పెట్టి పరోక్షంగా బీజేపీకి మేలు జరిగేలా కృషి చేసిన బీఆర్‌ఎస్‌కు గత ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారని వివరించారు. దీంతో రెండు పార్టీలు గిరిజనులపై కక్షగట్టి పాలన పదవులకు 9 ఏళ్లు దూరం పెట్టారని తెలిపారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లోను బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్లమెంట్‌లో 30 ఏళ్లుగా రాజ్యాసభలో ఎస్టీలకు అవకాశం కల్పించ లేదని ఎస్టీలకు గిరిజన కమిషన్‌ను ఏర్పాటు చేసి, స్థానిక సంస్థల్లో అవకాశాలతో పాటు, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. టీఎస్‌పీఎస్సీ కమిటీలో సభ్యుడిగా నియమించాలని, గిరిజన వర్సిటీని ములుగులో కాకుండా హైదరాబాద్‌కు సమీపంలో చౌటుప్పల్ లేదా నర్సాపూర్‌లో ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ప్రవేటు వర్సిటీల్లో ఉచిత విద్య, వీసీల నియామకాలలో ఎస్టీ అధ్యాపకులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు.

కంటోన్మెంట్ ఓఎస్‌గా యానీ



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆఫీస్ సూపరింటెండెంట్‌గా (ఓఎస్) యానీ నియమితులయ్యారు. గత ఓఎస్ అక్బర్ అలీ పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో సీనియర్ ఉద్యోగి యానీకి పదోన్నతి కల్పించారు. గురువారం ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. కేంద్ర సర్వీసులకు చెందిన సీఈఓ, జాయింట్ సీఈఓలను మినహాయిస్తే లోకల్ క్యాడర్ ఉద్యోగుల్లో సీనియర్‌కు ఈ పోస్టు దక్కుతుంది. 1987లో లోయర్ గ్రేడ్ క్లర్క్‌గా ఉద్యోగంలో చేరిన యానీకి దాదాపు ముప్పయి ఏళ్ల తర్వాత సీనియర్ అసిస్టెంట్‌గా తొలి ప్రమోషన్ దక్కింది. అనంతరం సీనియర్ గ్రేడ్ క్లర్క్‌గా చేసిన 2019లో చీఫ్ అకౌంటెంట్‌గా నియమితులయ్యారు. ఇటీవలే ట్యాక్స్ సూపరింటెండెంట్ పదవీ బాధ్యతలు చేపట్టిన ఆమె తాజాగా ఆఫీసర్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. నూతన ట్యాక్స్ సూపరింటెండెంట్‌గా హరిప్రసాద్ గుప్తా నియమితులయ్యారు.

స్టీఫెన్ రవీంద్ర పేరుతో ఫేస్‌బుక్‌లో చాటింగ్

ఫర్నిచర్ పేరిట రూ.47 వేలు స్వాహా

అమీర్‌పేట: ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్ర పేరుతో ఫేస్‌బుక్‌లో చాట్ చేసిన అగంతకుడు ఓ వ్యక్తి నుంచి డబ్బులు స్వాహా చేసిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాంప్రసాదరావు వివరాల ప్రకారం.. బీకేగూడ ఎస్‌ఆర్ నగర్‌కు చెందిన వ్యాపారి కె.వేణుగోపాల్ రెడ్డి ఫేస్‌బుక్ చూస్తుండగా ఐపీఎస్ స్టీఫెన్ రవీంద్ర పేరిట కలిపించిన ప్రొఫైల్ నుంచి చాట్ చేశాడు. స్టీఫెన్ రవీంద్రే తనతో చాట్ చేస్తున్నాడని వేణు భావించాడు. సంతోష్ కుమార్ అనే సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ నగరంలో నుంచి జమ్మూ కశ్మీర్‌కు బదిలీపై వెళ్తున్నాడని, అతని వద్ద ఫర్నిచర్ ఉందని స్టీఫెన్ రవీంద్రలా చాట్ చేస్తున్న వ్యక్తి పేర్కొన్నాడు. ఓ వాట్సాప్ నంబర్‌కు కూడా ఇచ్చాడు. వాట్సాప్‌లో ఫర్నిచర్ చూపి మొత్తం ఖరీదు రూ.47 వేలు చెల్లిస్తే ఫర్నిచర్ పంపుతానని అగంతకుడు చెప్పడంతో వేణు ఆ మొత్తాన్ని చెల్లించాడు.ఫర్నీచర్ పంపకపోగా మరి కొంత డబ్బు కావాలని అడగడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నిర్వహణ లోపం.. నిరుపయోగం



చిలకలగూడ ప్రధాన రహదారిలో ధ్వంసమైన బయో టాయిలెట్(ఫైల్)

పర్యవేక్షణ లేక అధ్వానంగా మారుతన్న టాయిలెట్లు

- రూ.లక్షల్లో ప్రజాధనం మట్టిపాలు
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న లష్కర్ అధికారులు



అదే స్థలంలో గతేడాది నిర్మించిన టాయిలెట్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారిన దృశ్యం

సికింద్రాబాద్: మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు రూపొందిస్తున్న కార్యాచరణలు ఆరంభశూరత్వంగానే మిగిలిపోతున్నాయి. అధ్యయనాలు, ప్రతిపాదనల రూపకల్పన వరకు వేగంగా సాగుతున్న వివిధ అభివృద్ధి పనుల తీరు కార్యాచరణకు వచ్చేసరికి నిధుల వృథాకు దారి తీస్తున్నాయి. సికింద్రాబాద్ ప్రాంతంలో రూ. లక్షలు వెచ్చించి చేపడుతున్న టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. పలు ప్రాంతాల్లో మూడు మార్లు టాయిలెట్లు ఏర్పాటు చేసినా నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన బయో టాయిలెట్ల పరికరాలు పూర్తిగా తుప్పుపట్టి నామ రూపాలు లేకుండా పోయాయి. అవే ప్రదేశాల్లో ఏడాది క్రితం మళ్లీ నిర్మించిన సాధారణ టాయిలెట్లు సైతం నిర్వహణ లేక పనికిరాకుండా పోతున్నాయి.

పర్యవేక్షణ లేక..

ప్రజలు వినియోగించుకోవడం కోసం సికింద్రాబాద్‌లో ఆర్భాటంగా ఏర్పాటు చేస్తున్న టాయిలెట్లు ఏడాది గడవక ముందే శిథిలావస్థకు చేరుతున్నాయి. నిర్వహణ లేమి కారణంగా గతంలో ఏర్పాటు చేసిన బయో టాయిలెట్లు ప్రారంభోత్సవాలు జరుగకుండానే నిరుపయోగంగా మారాయి. తాజాగా అవే స్థలాల్లో పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి నిర్మించిన టాయిలెట్లు సైతం శిథిలావస్థకు చేరుతున్నాయి. కొద్ది కాలంగా రోడ్డు విస్తరణలు, మెట్రో పనులు తదితర అభివృద్ధి పనుల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న సాధారణ మూత్రశాలలు, మరుగుదొడ్లను అధికారులు తొలగించారు. ఆ తర్వాత జనసంచారం అధికంగా ఉంటున్న క్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు కొత్తగా బయో టాయిలెట్లను ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపం కారణంగా అవి మూడేళ్ల క్రితమే భూగర్భంలో కలిసిపోయాయి. అవే స్థలాల్లో మరోమారు సిమెంట్ గోడలతో టాయ్‌లెట్లను నిర్మించి ఏడాది తిరగక ముందు మరుగున పడుతున్నాయి.

అంతటా అదే పరిస్థితి...

సికింద్రాబాద్ నుంచి చిలకలగూడ వెళ్లే మార్గంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన రెడిమేడ్ బయో టాయిలెట్ శిథిలం కావడంతో కొత్తగా మరో టాయిలెట్‌ను నిర్మించినా అది కూడా సౌకర్యాల లేమితో నిరుపయోగంగా మారింది. సికింద్రాబాద్ ప్రాంతంలో 23 ప్రాంతాలను ఎంపిక చేసిన అధికారులు బయో టాయిలెట్లను ఏర్పాటు చేశారు. సర్వాంగ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన బయో టాయిలెట్ల ఏర్పాటు పట్ల ఆయా ప్రాంతాల ప్రజల్లో హర్షం వ్యక్తం అయింది. ఇంత వరకు పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ కేవలం అధికారుల నిర్లక్ష్యంతోనే అవి ప్రారంభానికి నోచుకోలేదు.

సామగ్రి దొంగలపాలు..

కొన్నేళ్లుగా రహదారుల పక్కన నిరుపయోగంగా ఉంటున్న బయో టాయిలెట్లు పూర్తిగా కనుమరుగయ్యాయి. తుప్పుపట్టి పోయిన బయో టాయిలెట్ల ఇనుప సామగ్రి దొంగలపాలైంది. సికింద్రాబాద్ ప్రాంతంలో 23 బయో టాయిలెట్ల ఏర్పాటు కోసం జీహెచ్‌ఎంసీ అప్పట్లో రూ. 1 కోటి వెచ్చించినట్టు అధికారులు చెబుతున్నారు. భారీ వ్యయంతో ఏర్పాటు చేసిన బయో టాయిలెట్లు కళ్ల ముందే కాలగర్భంలో కలిసిపోయాయి. తాజాగా నిర్మించిన టాయిలెట్లు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన టాయిలెట్లలో సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఫుట్‌బాల్ క్రీడకు ఆదరణ



క్రీడాకారులతో జంపన ప్రతాప్

రసూల్‌పురా: జంటనగరాల్లో రోజురోజుకు ఫుట్‌బాల్ క్రీడకు ఆదరణ పెరుగుతోందని కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ పేర్కొన్నారు. యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానంలో జరుగుతున్న సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ లీగ్ మ్యాచ్‌లో గ్లోబ్ ఫుట్‌బాల్ జట్టు 1–0 గోల్‌తో సిటీ కాలేజీ జట్టుపై విజయం సాధించింది. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ..గతంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి ఎడ్వర్డ్, అమల్ రాజ్, అలీంఖాన్ ఎందరో క్రీడాకారులు అంతర్జాతీయ, ఒలింపిక్‌లో ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఫుట్‌బాల్ క్రీడకు పునర్వైభవం తీసుకవచ్చేందుకు ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ అధ్యక్షులు ఎడ్వర్డ్ జకారియా, సెక్రటరి మైకల్ అబ్రహం, రేమాండ్ హార్‌వుడ్, బెర్నార్డ్, వీనిత్, హ్యారి, పాలరెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ ఆలయంలో జరుగుతున్న శత చండీయాగ సహిత మహా కుంభాభిషేకం మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని లైట్‌సన్ హోటల్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్లమ్మ అమ్మవారి ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. గమనించిన కాంగ్రెస్ నాయకులు గురువారం ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణకు ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నరేష్, అద్నా, సలీంఖాన్, కృష్ణకుమార్, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆక్రమణలను కూల్చారు.. ట్రాఫిక్ సమస్యను తీర్చారు



లాలాపేట ప్రధాన రహదారిలో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం



రోడ్డెక్కుతున్న వ్యాపారాలు.. రాకపోకలకు ఇబ్బందులు

సాక్షిలో ప్రచురితమైన కథనం ఫైల్)

లాలాపేట: లాలాపేట ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, అక్రమ వ్యాపారాలతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తేది. ఈ సమస్యపై గత నెల 30న 'రోడ్డెక్కుతున్న వ్యాపారాలు.. రాకపోకలకు ఇబ్బందులు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ట్రాఫిక్ పోలీసు అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాలతో సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గురువారం లాలాపేట ప్రధాన రహదారిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి లాలాపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి ఓపెన్ నాలా కల్వర్టు వరకు రహదారికి ఇరువైపులా దాదాపు 100కు పైగా అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పబ్లిక్ రోడ్డును ఆక్రమిస్తే చర్యలుంటాయని రోడ్డుకు కేటాయించిన ప్రదేశంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు రజిత, సరిత, ప్రకాష్, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు దారివ్వబోయి ఆటోను ఢీకొట్టిన కారు



ధ్వంసమైన కారు ముందు భాగం

అమీర్‌పేట: వెనకాల నుంచి వస్తున్న అంబులెన్స్‌కు దారి ఇవ్వబోయి అదుపుతప్పిన కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవిరాజ్ వివరాల ప్రకారం.. సుందర్‌నగర్‌కు చెందిన సునీల్‌రాజ్ చౌహాన్ గురువారం మధ్యాహ్నం కారు నడుపుతూ అమీర్‌పేట ధరంకరం రోడ్డు మీదుగా లాల్‌బంగ్లా వైపు వెళ్తున్నాడు.

వెనకాల నుంచి అంబులెన్స్ రావడంతో దారి ఇచ్చేందుకు కొంత మేర రోడ్డు దిగాడు. అంబులెన్స్ ముందుకు వెళ్లగానే తిరిగి రోడ్డు ఎక్కించే క్రమంలో అతడి బూటు ఎక్సలేటర్ కింద ఇరుక్కుపోయింది. కారు అదే వేగంతో వెళ్తుండటాన్ని గమనించి తొందరలో హ్యాండ్ బ్రేక్ వేశాడు. దీంతో కారు ఒక్కసారిగా ఆగి రోడ్డు వైపు జారి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో మల్కాజ్‌గిరికి చెందిన ఆటో డ్రైవర్ పప్పుకుమార్, మోతీనగర్‌కు చెందిన మహిళ ఎస్.మాణికయాలదేవి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



కందోజీబజార్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. నియోజకవర్గంలోని రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలో కందోజీబజార్ బస్తీలో వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. స్థానికంగా సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్, ఎస్‌ఎస్ ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ స్తంభాలు, డ్రైనేజీ పైప్‌లైన్ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నల్లగుట్ట బస్తీకి చెందిన రాంగోపాల్‌పేట డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు మహ్మద్‌యాసిన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే ఆయనను పరామర్శించారు.

ఢిల్లీలో తెలుగు కేడెట్ల ప్రతిభ



ఎన్‌సీసీ కేడెట్లతో జనరల్ వీఎం. రెడ్డి

రసూల్‌పురా: గణతంత్ర దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే క్యాంప్‌లో వివిధ పోటీల్లో ఆంధ్ర తెలంగాణ డైరక్టరేట్ కేడెట్లు ప్రతిభ కనబర్చారని ఎన్‌సీసీ డిప్యూటీ డైరక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వీఎం. రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 128 కేడెట్ల బృందం ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొందని చెప్పారు. జూనియర్ ఆర్మీ వింగ్‌లో ఎం. శ్రీకాంత్, నేవీ వింగ్‌లో ఎస్. ధీరజ్ ఆల్ ఇండియా అత్యుత్తమ కేడెట్లుగా, ఈక్వేస్ట్రియన్ ఈవేంట్‌లల్లో ఎస్‌కే. రహేనా, ఎస్. చిత్తేష్‌రావు, జి. లోహిత్ సత్తా చాటారు. సీనియర్ ఆర్మీ వింగ్‌లో ఆకాంక్ష బొంస్లే, రెండవ స్థానం, మహా బల్దేవ్ డీజీఎన్‌సీసీ కమెండేషన్ కార్డ్ సాధించారన్నారు. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన శ్రీకాంత్, ధీరజ్‌లను ప్రధాని మోదీ సత్కరించారన్నారు.

నూతన ప్రభుత్వంలో ఓయూ ప్రొఫెసర్‌కు తొలి పదవి



ప్రొ.శ్రీరామ్ వెంకటేష్

ఉస్మానియా యూనివర్సిటీ: నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఓయూ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌ను తొలి పదవీ వరించింది. క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్‌గా కొనసాగుతున్న ఆయనను రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యదర్శిగా నియమించగా గురువారం బాధ్యతలు చేపట్టారు. కాలేజీ ప్రిన్సిపల్ కొనసాగుతూ అదనంగా కార్యదర్శి పదవిలో కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో వివిధ పదవులను సమర్థవంతగా నిర్వహించిన ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ ప్రతిభను గుర్తించి కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సికింద్రాబాద్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 16న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సమ్మె ప్రచారంలో భాగంగా కార్మికుల మద్దతు కోసం చిలకలగూడ లేబర్‌అడ్డా వద్ద గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టీ.మహేందర్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లేబర్ కోడ్‌ను అమలులోకి తెచ్చి కార్మికుల హక్కులను హరించిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు లెబర్‌అడ్డాల వద్ద దినసరి కూలీలకు కనీస వసతులైన మూత్రశాలలు, మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. లేబర్ అడ్డాల వద్ద, షెడ్లు, టాయ్‌లెట్లు, తాగునీటి సదుపాయాలను ప్రభుత్వం విధిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో కనీసం 200 రోజులు పని దొరికే విధంగా దినసరి కార్మికుల కోసం పట్టణ ఉపాధిహామీ పథకాన్ని అమలులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మధు, నర్సింగరావు, పోచయ్య, స్వామి, సోమేష్, మహమూద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎయిర్ వెల్ఫేర్ సిబ్బంది

సనత్‌నగర్: దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్లను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా టీటీఐ ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ కాలేజ్ ఆఫ్ ఎయిర్ వెల్ఫేర్ సిబ్బందికి రోడ్డు సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడిపిస్తే రూ.10 వేల జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందన్నారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలని తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వాహనాలను నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ఆఫ్ ఎయిర్ వెల్ఫేర్ కమాండెంట్ పీఎస్ వడోద్కర్, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, ఆర్‌ఎస్‌ఐ శ్రీధర్, కృష్ణ పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం



మంత్రిని కలిసిన విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిశోధన విద్యార్థి పొన్నం ముత్యంగౌడ్ నేతృత్వంలో గురువారంఓయూ విద్యార్థులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సన్మానించారు. ఓయూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో డా.దూడపాక సురేష్, డా.జనగామ సంతోష్, బొప్పు కమలాకర్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య



జ్యోతి(ఫైల్)

అమీర్‌పేట: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవిరాజ్ వివరాల ప్రకారం.. అమీర్‌పేట బీజేఆర్‌నగర్‌లో గంటబోయిన కృష్ణ–జ్యోతి (31) దంపతులు నివాసముంటున్నారు. వీరికి 13 ఏళ్ల క్రితం వివాహం కాగా సంతానం లేదు. కృష్ణ స్విగ్గీలో పనిచేస్తుండగా జ్యోతి ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి అలవాటు పడ్డ కృష్ణ రోజూ తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. బుధవారం ఎప్పటిలాగే సాయంత్రం పనికి వెళ్లిపోయాడు. రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిన కృష్ణ భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భర్త కృష్ణ వేధింపుల కారణంగానే జ్యోతి ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

నియామకం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా యువజన కాంగ్రెస్ నాయకుడు వేణుగోపాల్ నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మందాడి అనిల్‌కుమార్‌గౌడ్ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం కోసం కృషి చేస్తామన్నారు.



ఉద్యోగాల భర్తీ ప్రకటనపై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన పట్ల ఓయూ జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థి, నిరుద్యోగులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 50 రోజులలోనే 6956 స్టాఫ్ నర్సు ఉద్యోగాలను భర్తీ చేయడం సంతోషకరమన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంజి, యేసు, సతీష్, సింహాద్రి, అనీల్, యాదగిరి గౌడ్, మధు, రమణ, మచ్చ శ్రీను పాల్గొన్నారు.

ఎన్‌ఈపీ రద్దుకు రేపు ఢిల్లీ విద్యార్థుల మార్చ్

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన జాతీయ విద్యా విధానం 2020ను రద్దు చేయాలని రేపు (3న) ఢిల్లీలోని జంతర్‌మంగతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన విద్యార్థుల మార్చ్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.మహేష్, ఎస్వీ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కుల, మత అంతరాలను పెంచిపోషించి, దేశ విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే నూతన విద్య విధానంతో భవిష్యత్‌లో ప్రమాదమన్నారు. విద్య ఉమ్మడి జాబితాల్లో ఉన్నప్పటికి దేశంలోని ఏ రాష్ట్రంతో సంప్రందించకుండా ఏకపక్షంగా అమలు చేయడం దుర్మార్గమన్నారు. నూతన విద్య విధానాన్ని రద్దు చేయకుంటే బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

సికింద్రాబాద్: కర్పూరీ ఠాగూర్‌ను భారతరత్న అవార్డుకు ఎంపిక చేసినందుకు సీతాఫల్‌మండిలో గురువారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. నగర నాయకుడు ఆకారపు రమేశ్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ గరాటే హాజరై మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి, వెంకటరమణి, నాగేశ్వర్‌రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, రవిప్రసాద్‌గౌడ్, కనకట్ల హరి, మేకల కీర్తి పాల్గొన్నారు.

